నమస్తే తెలంగాణ
# జనగామ
5 | వరంగల్, శనివారం 18 జనవరి 2025 | JANAGAON


మహిళల పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

## అట్టహాసంగా పోలీసు క్రీడలు

**ప్రారంభించిన సీపీ అంబర్ కిశోర్ ఝా**

సుబేదారి, జనవరి17: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసు క్రీడా పోటీలు హనుమకొండ జేఎన్ఎస్‌లో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. ఈ పోటీల్లో కమిషనరేట్ పరిధిలోని ఈస్ట్, వెస్ట్, సెంట్రల్ జోన్లలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి మూడు రోజులు 12 క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. క్రీడా పోటీలతో దేహ దారుఢ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, పని ఒత్తిడిని అధిగమించడానికి ఇవి దోహదపడుతాయని సీపీ పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ చాటిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా నిర్వహించిన 800 పరుగుపందెం, వాలీబాల్ పోటీలను సీపీ ప్రారంభించారు. అదేవిధంగా వాలీబాల్ క్రీడలు సెయింట్ గ్యాబ్రియల్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీలు రవీందర్, రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీ రవి, సురేశ్‌కుమార్, జనగామ ఏఎస్పీ పండరీ చేతన్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

## కాళోజీ క్షేత్రం కళా విహీనం

**హనుమకొండలోని కళా నిలయం మూసివేత**

- రెండు నెలల క్రితం ప్రారంభించిన సీఎం రేవంత్
- ఆ ఒక్క రోజు తప్ప మళ్లీ తెరుచుకోని తలుపులు
- ఒక్క కార్యక్రమం నిర్వహించని పరిస్థితి
- పడావుగా రాష్ట్రంలోనే అతి పెద్ద కళా కేంద్రం
- కవులు, కళాకారుల తీవ్ర అసంతృప్తి
- రూ.85.10 కోట్లతో కేసీఆర్ సర్కారు నిర్మాణం

**వారసత్వ, చారిత్రక**, సాంస్కృతిక రంగాల్లో ఓరుగల్లుకు ఉన్న గుర్తింపును మరింత పెంచేలా గత కేసీఆర్ ప్రభుత్వం రూ. 85.10 కోట్లతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళోజీ కళా క్షేత్రం ప్రస్తుతం కళ తప్పింది. సీఎం రేవంత్‌రెడ్డి నవంబర్ 19న అట్టహాసంగా కళా నిలయాన్ని ప్రారంభించగా, ఆ తర్వాత రోజు నుంచే మూసివేయడంతో పడావుగా ఉంటున్నది. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) పరిధిలో ఈ కేంద్రం నిర్వహణ ఉండగా, సాహిత్య, సాంస్కృతిక, నాటక కార్యక్రమాలకు కేటాయించాలని కోరినా వారి నుంచి స్పందన కరువైంది. ఏ స్ఫూర్తితో దీన్ని నిర్మించారో అది నెరవేరకపోవడంపై కళాకారుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

*- వరంగల్, జనవరి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*


హనుమకొండలోని కాళోజీ కళా క్షేత్రం

చారిత్రక వరంగల్ నగరాన్ని సాంస్కృతిక, సాహిత్య, నాటక రంగాల కార్యక్రమాలకు కేంద్రంగా నిలిపేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళోజీ కళా క్షేత్రం కళా విహీనంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన వెంటనే మూసివేసి రెండు నెలలవుతున్నా ఇప్పటికీ మళ్లీ తెరువలేదు. సాహిత్య, సాంస్కృతిక, నాటక కార్యక్రమాలకు కేటాయించాలని కోరినా కుడా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. అందులో ఏ కార్యక్రమాలను నిర్వహించాలనేది, ఎంత మొత్తం చెల్లించాలనేది ఇప్పటికీ స్పష్టత లేదు. కాళోజీ కళా క్షేత్రం నిర్మించిన స్ఫూర్తి నెరవేరకపోవడంతో కవులు, కళాకారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కళా నిలయాన్ని కనీసం వినియోగించే స్థితిలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవడంలేదని విమర్శిస్తున్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద కళా క్షేత్రం ఇలా పడావుగా ఉండడం సరికాదని అంటున్నారు. మరో వారం వర కు వేచి చూసి నిరసన తెలియజేస్తామని హెచ్చరిస్తున్నారు.

### అత్యాధునిక టెక్నాలజీతో నిర్మాణం

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తపించి, పోరాడిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు శతజయంతి ఉత్సవాలు 2014 సెప్టెంబరు 9న మొదలయ్యాయి. ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అదే రోజు కాళోజీ కళా క్షేత్రం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. 4.25 ఎకరాల్లో 1.39 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో నాలుగు అంతస్తులతో నిర్మించారు. 1500 సీటింగ్ సామర్థ్యంతో ఆడిటోరియం, మీటింగ్ హాల్, డైనింగ్ హాల్స్, వీఐపీ సూట్స్‌ను అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించారు. కార్యక్రమాల నిర్వహణకు అనుగుణంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు మేకప్ రూములు ఉన్నాయి. ఆర్ట్ గ్యాలరీ, దీన్ని కూర్చుని చూడడానికి వీలుగా ఫ్రీ పంక్షన్ లాబీని ఏర్పాటు చేశారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాలుగు హై కెపాసిటీ లిఫ్ట్‌లను బిగించారు. రూ.85.10 కోట్లతో భవన నిర్మాణం పూర్తయ్యింది. భవనం నిర్మాణం పూర్తయిన తర్వాత 2023 అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రారంభోత్సవం వాయిదా పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల తర్వాత... నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కళా క్షేత్రాన్ని ప్రారంభించారు. ఆ ఒక్క రోజు తప్ప ఎప్పుడూ తెరుచుకోలేదు.

## వచ్చే నెలలో మహాకుంభాభిషేకం

- కాళేశ్వరంలో ఘనంగా నిర్వహిస్తాం
- ఏర్పాట్లపై కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో సమీక్ష


కాళేశ్వరంలో పుష్కరాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

మహదేవపూర్(కాళేశ్వరం), జనవరి 17 : కాళేశ్వరంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో జరిగే మహాకుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహిస్తామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో మహా కుంభాభిషేకం, మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతీ పుష్కరాల నిర్వహణ, ఆలయ అభివృద్ధి పనులపై శుక్రవారం అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంభాభిషేకానికి సుమారు 20 వేల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని, అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. గోదావరి నదిలో ఇసుకపై తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మించాలని, వీఐపీ ఘాట్ నుంచి పుష్కర ఘట్లను అనుసంధానం చేసేలా తాత్కాలిక రోడ్డు వేయాలన్నారు. తాత్కాలికంగా శానిటైజేషన్ వర్కర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు స్థలం, వీఐపీ ఘాట్, ప్రధాన ఘాట్ నుంచి వీఐపీ ఘాట్ వరకు రహదారి నిర్మాణం, మెయిన్ రోడ్డు నుంచి ఘాట్ వరకు రెండు వరుసల రహదారి నిర్మాణం చేపట్టే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీ బోనాల కిషన్, డీపీవో నారాయణ రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కమ్ముకున్న పొగ మంచు

- ఉదయం 8 గంటలు దాటినా ప్రభావం
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు, వాహనదారులు

*నర్సంపేట-మల్లంపల్లి ప్రధాన రహదారిని పొగ మంచు దట్టంగా కమ్మేసింది. శుక్రవారం ఉదయం 8 గంటలు దాటినా ప్రభావం పోలేదు. దీంతో రోడ్లపై వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బంది పడ్డారు. లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వచ్చింది.*

*- నర్సంపేట, జనవరి17*

ఎడ్‌సెట్ కార్యాలయాన్ని ప్రారంభించిన వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి



## ఎడ్‌సెట్‌ను సమర్థవంతంగా నిర్వహిద్దాం

**కార్యాలయ ప్రారంభోత్సవంలో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి**

హనుమకొండ చౌరస్తా, జనవరి 17: అందరి సహకారంతో ఎడ్‌సెట్-25ను సమర్థవంతంగా నిర్వహిద్దామని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కే ప్రతాప్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ కామర్స్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఎడ్‌సెట్-2025 కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేయూకు గతంలో కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లు నిర్వహించిన అనుభవం ఉందని, ఇంకా మరిన్ని సెట్‌లను పొందే ప్రయత్నం చేద్దామన్నారు. గతంలో ఎడ్‌సెట్, 13 సంవత్సరాలు వరుసగా ఐసెట్ నిర్వహించినట్లు గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఎడ్‌సెట్-25 కన్వీనర్ ఆచార్య బీ వెంకట్రామిరెడ్డిని అభినందించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీ మల్లారెడ్డి, వీ రామచంద్రం, ఎన్ రామనాథకిషన్, వై వెంకయ్య, గాదె సమ్మయ్య, ఎన్ ప్రసా ద్, ఈసం నారాయణ, పీ అమరావేణి, ఎస్ నరసింహాచారి పాల్గొన్నారు.

ఎర్రచక్రతండాలో మిరప కాయలు ఏరుతున్న మధ్యప్రదేశ్ కూలీలు



## మధ్యప్రదేశ్ టు నర్సింహులపేట

- పని కోసం తెలంగాణకు వస్తున్న కూలీలు
- 8 నెలలు ఇక్కడే మకాం..
- రైతులకు తీరుతున్న కూలీల కొరత

నర్సింహులపేట, జనవరి 17 : ఉపాధిని వెతుక్కుంటూ మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణకు వచ్చిన వ్యవసాయ కూలీలకు ఇక్కడ చేతినిండా పని దొరుకుతున్నది. జూన్ నెలలో వచ్చి 8నెలల పాటు ఇక్కడే ఉండి పనులు చూసుకొని మళ్లీ మార్చి, ఏప్రిల్ నెలల్లో తమ స్వస్థలాలకు వెళ్తారు. ఈ సారి వానలు పుష్కలంగా కురవడం.. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడం.. బావులు, బోర్లలో నీటి లభ్యత ఉండడంతో ఎక్కడ చూసినా పచ్చని పైర్లే కనిపిస్తున్నాయి. రైతులు కూడా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. నాటు పనులు, మిరప కాయలు ఏర డం తదితర పనుల్లో అన్నదాతలు, వ్యవసాయ కూలీ లు బిజీబిజీగా ఉన్నారు. అయితే, వ్యవసాయ పనులకు మంచి సీజన్ కావడంతో కూలీలకు కొరత ఏర్పడింది. ప్రస్తుతం యాసంగి నాటు వేసేందుకు ఎకరానికి రూ.5వేల నుండి రూ.6వేలు, మిరప ఏరేందుకు రోజు కూలీ రూ.300లతోపాటు కూలీలను వాహనాల్లో తీసుకొచ్చే ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. అదే సమయంలో కొందరు రైతులు మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి ఉపాధి కోసం ఇక్కడి వచ్చిన కూలీలపై ఆధారపడుతున్నారు. నర్సింహులపేట మండలం రూప్లాతండా గ్రామ పంచాయతీకి చెందిన రైతులు జాటోత్ శ్రీను, సంతోష్ తమ మిరప పంట ఏరేందుకు మధ్యప్రదేశ్ కూలీలను ఖమ్మం జిల్లా నుంచి ఇక్కడకు రప్పించారు. మన దగ్గరి కూలీలు రోజువారీగా పనులు చేస్తే.., వారు కిలోకు రూ.15చొప్పున కాయలు ఏరుతున్నారు. దీంతో రైతుల పనులు కూడా చకచకా సాగిపోతున్నాయి. వీరు చెలుకల దగ్గరే గుడారాలు వేసుకొని ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పనిచేస్తున్నారు. ఐదారు రోజుల్లో ఎకరం మిరప కాయలు ఏరుతున్నారని రైతులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చెలుక వద్దనే గుడారాలు ఏర్పాటు చేసుకున్న కూలీలు




స్మార్ట్ నిధులతో సగం పూర్తయిన పద్మాక్షి రోడ్డు

## స్మార్ట్ సవాల్

**గడువు లోగా పనులు పూర్తి చేయడంలో బల్దియా అట్టర్‌ఫ్లాప్**

వరంగల్, జనవరి17 : స్మార్ట్‌సిటీ స్కీం బల్దియాకు సవాల్‌గా మారింది. మరో 70 రోజుల్లో స్కీం ముగుస్తున్న తరుణంలో చేపట్టిన పనులు వందశాతం పూర్తిచేయడం అసాధ్యంగా కనిపిస్తోంది. పదేళ్ల క్రితం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్‌సిటీ పథకంలో దేశంలోని 100 నగరాల్లో చారిత్రక వరంగల్ ఒక్కటిగా నిలిచింది. నగరాలను అభివృద్ధి చేస్తూ పర్యాటకంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఇందులో భాగంగా చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయడంలో బల్దియా అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. 108 పనులు చేపట్టిన అధికారులు అందులో సగం మాత్రమే పూర్తి చేశారు. మిగతా సగం వివిధ దశల్లో ఉండగా, మరికొన్ని రీ టెండర్ చేయాల్సి ఉన్నది. అయితే ఈ పథకం గతేడాది జూన్ నెలలోనే ముగిసినా కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 31 వరకు పొడిగించింది. గడువు ముగిసేలోపు వందశాతం పూర్తి చేయాలన్న నిబంధన పెట్టడంతోపాటు గడువులోపు పూర్తయిన పనులకు మాత్రమే నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేసింది. నగరంలో చేపట్టిన పనుల్లో సగం వరకు పూర్తి కాలేదు. గడువు ముగిసేలోపు వాటిని పూర్తి చేయడమెలా అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మరికొన్ని సగంలోనే ఆగిపోవడంతో మళ్లీ టెండర్లు పిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గడువులోగా పనులు పూర్తి చేయడం కష్టమేనని అధికారులు అంటున్నారు. స్మార్ట్‌సిటీ పథకాన్ని వినియోగించుకోవడంలో బల్దియా పూర్తిగా విఫలమైందన్న విమర్శలు ఉన్నాయి.

డ్రైనేజీ, డివైడర్లు, ఫుట్ పాత్‌లు బాలాజీ నగర్ టు లేబర్‌కాలనీ స్మార్ట్‌రోడ్డు



### సగం పనులు పూర్తి

- 70 రోజుల్లో ముగియనున్న స్కీమ్
- సగం పనులే పూర్తి.. రీ టెండర్ దశలో మరికొన్ని..

స్మార్ట్‌సిటీ స్కీంలో రూ. 944 కోట్లతో 108 అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో రూ. 427కోట్లతో 54 పనులను పూర్తి చేశారు. రూ.517కోట్లతో చేపట్టిన మరో 54 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అందులో సుమా రు 20 పనులు 10 శాతం వరకే జరిగాయి. ముఖ్యంగా ప్రధాన రహదారుల పనులు మధ్యలో నిలిచిపోవడంతో రీ టెండర్లు పిలవాల్సిన పరిస్థితి. బాలాజీ నగర్ జంక్షన్ నుంచి లేబర్‌కాలనీ వరకు చేపట్టిన 100 ఫీట్ల రహదారి పనుల్లో రోడ్డు మాత్రమే నిర్మించారు. డ్రైనేజీ, డివైడర్లు, హైమాస్ లైట్లు, ఫుట్‌పాత్ నిర్మాణాలు చేయాల్సి ఉంది. ఎంజీఎం నుంచి కాశీబుగ్గ వరకు నిర్మించాల్సిన రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మధ్య మధ్యన రోడ్డు నిర్మాణంతోపాటు డ్రైనేజీ, డివైడర్, ఫుట్‌పాత్, హైమాస్ లైట్ల పనులు ఉన్నాయి. పనులు చేయకపోవడంతో పాత కాంట్రాక్టర్ టెండర్‌ను రద్దు చేసిన అధికారులు మళ్లీ రీ టెండర్‌ను పిలిచేందుకు సిద్ధమవుతున్నారు.

అయితే ఈ పథకంలో చేపట్టిన పనులన్నీ వందశాతం పూర్తయ్యేనా అనే సందేహాలు కలుగుతున్నాయి. 50 శాతం పనులు పూర్తి చేసిన అధికారులు మిగతా పనులను గడువులోగా పూర్తి చేయడం కష్టంగా మారింది. రీ టెండర్ల ప్రక్రియ పూర్తి చేయడం అధికారులకు సవాల్‌గా మారింది. అయితే ప్రధాన రహదారులకు సంబంధించిన రెండు పనులతోపాటు బయోమైనింగ్, పోతననగర్ నాలా పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. 70 రోజుల గడువులో గ్రేటర్ పరిధిలో స్మార్ట్‌సిటీ పథకంలో చేపట్టిన పనులు వంద శాతం పూర్తి చేయడం సాధ్యం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మార్చి 31లోగా స్మార్ట్‌సిటీ పనులను పూర్తి చేయాలన్న లక్ష్యంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గడువులోగా 90 శాతం పనులైనా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నారు. అయితే పూర్తి చేయాల్సిన 54 అభివృద్ధి పనుల్లో దాదాపు 20 పనులు 10 శాతం మాత్రమే జరగడం అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నది. స్మార్ట్‌సిటీ పనులను స్కీం గడువు ముగిసే వరకు పూర్తి చేస్తారా? లేదా? అనేది వేచి చూడాల్సి ఉంది.

## పత్తిచేనులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

**డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం**

గోవిందరావుపేట, జనవరి 17 : అదుపుతప్పి ఆర్టీసీ బస్సు పత్తిచేనులోకి దూసుకెళ్లిన ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మచ్చాపూర్ శివారులో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం హనుమకొండ నుంచి ఏటూరునాగారానికి ప్రయాణికులతో బయల్దేరిన టీఎస్ 27 జడ్ 0011 నంబర్‌గల ఆర్టీసీ బస్సు మచ్చాపూర్ శివారులోకి రాగానే ఒక్కసారిగా స్టీరింగ్ లాక్ అయి పత్తి చేనులోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో డ్రైవర్ అప్రమత్తమై బ్రేక్ వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు పల్టీకొట్టి ఉంటే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. బస్సులో 50 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని పస్రా ఎస్సై కమలాకర్, ఆర్టీసీ అధికారులు పరిశీలించారు. గాయపడిన ప్రయాణికులను చికిత్స కోసం 108 వాహనంలో ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.


మచ్చాపూర్ సమీపంలో అదుపు తప్పి పత్తి చేనులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు